



గుడ్ నైట్!

కంటి నిండా నిద్ర పట్టాలంటే కేవలం కడుపు నిండా తింటే సరిపోదు. తిండి కంటే కూడా ఇతరత్రా దినుసులు చాలా అవసరం. మేడల్లో డన్‌లప్ పరుపుల మీద నిద్ర పట్టక తన్నుకునే పెద్దలున్నట్లే కటిక నేలమీద కడుపులో కాళ్ళు పెట్టుకుని కమ్మగా నిద్రపోయే కష్టజీవులూ వున్నారు. అలాంటప్పుడు నిద్రకి పరుపులనవసరం అనుకుంటే థియరీ దెబ్బ తీస్తుంది.

నువ్వెక్కడ పడుకుంటున్నావని అడిగే దానికంటే, నీ మనసు ప్రశాంతంగా వుందా అని అడగటం బెటరు. మనసులో అల్లకల్లోలం చెలరేగుతుంటే హంసతూలికాతల్పం కూడా పనిచేయదు. అట్లాగే మనసులో తృప్తి, ఆనందం చోటు చేసుకున్నప్పుడు కటిక నేల సైతం నిద్రాదేవికి ఆహ్వానం పలుకు

తుంది. కనుక సుఖమైన నిద్ర కావాలనుకుంటే మానసికారోగ్యం చాలా అవసరమని తేలింది. వదిలేయండి. మానసికారోగ్యం టన్నులకొద్దీ వున్నా కొందరు మహాశయులు కొన్ని ఏర్పాట్లు లేకపోతే నిద్ర పోలేరు. ఫేన్ శబ్దానికి బానిసలైన ఫ్రండ్సు నాకు చాలామంది వున్నారు. వాతావరణం ఎంత చల్లగా, చలిగా వున్నా సరే, ఫేన్ తిరగాలి. చలి శరీరాన్ని కొరి కేస్తుంటే రగ్గు కప్పుకోవటానికైనా సిద్ధమే గాని ఫేన్ లేని గదిలో నిద్ర పట్టదు. అది తిరుగుతూ చేసే శబ్దం మెదడ్లో పని చేసి మత్తు నిస్తుంది. ఆటోమేటిగ్గా నిద్ర పడుతుంది. అస్తమానం రైళ్లో తిరిగే ఉద్యోగస్తులకు రైళ్లోనే బాగా నిద్రపడుతుంది. దాని సుతిమెత్తని కుదుపులా....లయబద్ధమైన చప్పుడూ....వంతెనలు దాటేటప్పుడు వచ్చే లోతు శబ్దాలు ఈ వగైరా హంగులు వాళ్ళ నిద్రకి చాలా అవసరం.

ఏమున్నా ఏమి లేకపోయినా సరిగ్గా రాత్రి తొమ్మిది గంటలకు ముసుగు పెట్టేస్తాడు మా భద్రం. ముసుగు పెట్టిన అయిదో నిమిషానికి గురక ప్రారంభిస్తాడు. మళ్ళా ఉదయం ఆరు గంటలగ్గాని ప్రపంచాన్ని చూడడు. ఈలోగా రండోళ్ళు మోగించినా ఛీ! పొమ్మంటాడేగాని గురక మానడు. మహాఅయితే ఫస్టు షో సినిమా అయ్యేతవరకు వాణ్ణి అదుపులో వుంచగలం. ఆ తర్వాత తీగలా ఒక్కడోచోటు వాలిపోతాడు. కునుకుతీస్తాడు. వాడ్ని సెకండ్‌షో సినిమాకు తీసుకువెడితే వాడికి కొన్న టిక్కెట్టు శుద్ధ వేస్టు. న్యూస్ రీలు పూర్తికాగానే తల వాల్చేస్తాడు. సెక్సు సీన్‌లు రావచ్చు, హారర్ దృశ్యాలు కావచ్చు. డోంట్ కేర్! మీ భుజంమ్మీద ఎంచక్కా గురక పెడుతుంటాడు. వాడితో మీరు సెకండ్ షోకి వెడితే మీరు వాడికి మంచంగా కూడా అవ్వాలి, తప్పదు. ఒక భుజంమ్మీద వాడి బరువును చచ్చినట్టు మోస్తూ సినిమా చూడాలేగాని విసుక్కున్నారో రిక్షా ఎక్కి వెళ్ళిపోతాడు. అట్లాగని వాడు సినిమాలు చూడటం తగ్గిస్తాడంటే అదీలేదు. బతిమాలి, బామాలి మనల్నికూడా తీసుకెడతాడు. మనమీదపడి నిద్రపోతాడు. ఇదేం పోయేకాలంరా నీకు అని అడిగితే....సినిమాహాల్లో నాకు బ్రహ్మాండమైన నిద్రపడుతుంది గురూ అంటాడు. ఆ నిద్ర వాడి కేదో వెరైటీ మత్తు వస్తుందని మనం గమనించాలేగానీ వాడ్ని తిడితే ఆ పాపం మనకే చుట్టుకుంటుంది.

భద్రాన్ని వదిలేయండి. సినిమాలేదు, గినిమాలేదు పడుకో వెధవాని చింకి చాప పరిచినా, తొమ్మిది గంటలకి కన్నుమూస్తాడు. కుక్కపిల్లలా కునుకు తీస్తాడు. చలం సంగతి మాత్రం అట్లాకాదు. వాడివన్నీ రాక్షస కోరికలు. నిశ్శబ్దంగా వుంటే వాడికి నిద్ర పట్టదు. కారు హారు, లారీల మోత, రిక్షా గంటలూ సుబ్బరంగా వినిపించాలి. చుట్టుప్రక్కలంతా గోల గోలగా వుండాలి. వీటికి ఏమాత్రం భంగం కలిగినా నిద్రపట్టక తన్ను కుంటాడు. ఈ వింత చర్యకు కారణం కూడా వుంది. మా వూళ్ళో వాడిల్లు రద్దీగావుండే రోడ్డు ప్రక్కనే వుంది. ఆ రోడ్డుమీద అర్ధరాత్రి పన్నెండు గంటల వరకూ జనం తిరుగుతూనే వుంటారు. వాహనాలు నడుస్తూనే వుంటాయి. వీరమోతలు. ఆ శబ్దాలే వాడికి జోలపాట లయ్యాయి ముప్పై ఏళ్ళుగా ఆ మోతలకి అలవాటుపడిన ప్రాణం గదా, ఏ పాటి నిశ్శబ్దాన్ని కూడా సహించలేడు. మనం వాడింటికి వెడితే వీధిలోని శబ్దాలతో ఆ రాత్రి మనకి శివరాత్రి జాగారమవుతే కావచ్చుగానీ, వాడు మాత్రం వళ్ళెరక్కుండా పడుకుని వుంటాడు. వాడే మనిళ్ళకి వస్తే, అమ్మో యింత నిశ్శబ్దమాని అదిరి చస్తాడు.

ఈ మధ్య చలం ఒక పద్ధతి కనిపెట్టేడు. వాడు పొరుగూరు వెళ్ళవలసివస్తే తన వెంట టేపు రికార్డరు తెచ్చుకుంటున్నాడు. గంటన్నర టేపులో వివిధ వాహనాల శబ్దాలు, చేపల మార్కెట్లో జనం గోల వగైరాలు రికార్డు చేసుకున్నాడు. గుడ్‌నైట్ చెప్పకునే ముందు ఆ టేపుని ఆన్ చేసుకుంటాడు. ఒక పక్క నలభై అయిదు నిమిషాలు నడుస్తుంది టేపు. అది పూర్తయ్యే లోపల నిద్రలోకి జారుకుంటాడు. లేదు, రెండోవైపు కూడా ప్లేచేసి వాడ్ని జోకొట్టాలి. ఈ కండీషన్ని ముందరే వాడు మనకి చెబుతాడు. ఆ టేపు వాడికి నిద్ర మాత్రయ్యింది పాపం!

గత జూన్ నెలలో చలానికి హైదరాబాదు బదిలీ అయ్యింది. ఇల్లు చూసుకోడానికి వచ్చేడు. సినిమా చూసి చిక్కడపల్లి రోడ్డుమీద నడుస్తున్నాం. ఆ రోడ్డు ఎంత బిజీగా వుంటుందో, ఎంత గొడవగా వుంటుందో హైదరాబాదీయులందరికీ తెలుసు. రోడ్డు కివతలనుంచి అవతలకి వెళ్ళాలంటే అరగంట పడుతుంది. ఎడతెరిపిలేకుండా కార్లూ, సిటీబస్సులు,

ఆటోరిక్షాలు రయ్‌మంటూ తిరుగుతుంటాయి. ఎప్పుడు ఏక్సిడెంటవుతుందో నన్న భయం ఒకప్రక్క పీకుతుంటే, చెవులు చిల్లులుపడే ఆ రొదలో ఒకరి మాట ఒకరికి వినిపించకపోవడంతో విసుగో పక్క, చిరాకు పెడుతుంది. రద్దీ ఎక్కువగా వుండే రోడ్డుమీద ఏ ఇద్దరైనా గొంతు చించుకు మాట్లాడు తున్నట్టు కనిపిస్తే ఈజీగా చెప్పవచ్చు. అప్పుడే ఆ ఇద్దరూ చిక్కడపల్లి రోడ్డు దాటివచ్చేరని. ఆ రోడ్డుమీద అరచి మాట్లాడిన గొంతు అరగంటకిగాని అదుపులోకి రాదు. అట్లాంటి రోడ్డుని చూసి చలంగాడెంతో ఆనందించేడు. ఓహో, ఆహా అన్నాడు. ఒరేబాబూ.... ఈ రోడ్డుమీద ఇళ్ళల్లో ఏ చిన్న పోర్షను దొరికినా చాలురా. అద్దె ఎంతైనా ఫర్లేదు. బంగారం లాంటి రోడ్డు. బాబ్బాబు ఎవర్నైనా అడిగి చూడ్రా అని ఎంతో ప్రాధేయపడ్డాడు. వాడి చేష్టకి ఏ పేరు పెట్టాలో తోచలేదు. నరకానికి దారెటని మా కొల్లీగ్ వచన కవిత్వం రాస్తూ చిక్కడపల్లి రోడ్డని పూర్తి చేసేడు. అట్లాంటి రోడ్డుని పట్టుకుని బంగారం, సింగినాదమని చలంగాడు బిరుదులిస్తుంటే నాకు పిచ్చెక్కినంత పనైంది. కాని పాపం....వాడి నిద్రకది అనువైన ప్రాంతం. ఏం చేస్తాం, ఎవడి బలహీనతలు వాడివి.